మెట్రో పార్కింగ్ లక్ష్యంగా బైక్‌ల చోరీ

- మూడు కమిషనరేట్ల పరిధిలో 59 వాహనాలు
- స్వాధీనం చేసుకున్న పోలీసులు
- నిందితుడితో పాటు ఇద్దరు రిసీవర్ల అరెస్ట్

బేగంపేట, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్, బస్టాండ్, మెట్రో పార్కింగ్ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడుతున్న కరుడుగట్టిన దొంగ రాయుడు చైతన్యసాయికుమార్(33)తో పాటు ఇద్దరు రిసీవర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో చోరీకి గురైన 59 ద్విచక్రవాహనాలను వారి నుంచి బేగంపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను బుధవారం బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో నార్త్‌జోన్ డీసీపీ ఎస్.రష్మీ పెరుమాళ్ వెల్లడించారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని పాల్వంచకు చెందిన రాయుడు చైతన్యసాయికుమార్ పాలిటెక్నిక్ డిప్లొమా చదువుతూ మధ్యలోనే ఆపేశాడు. ఉపాధి కోసం నగరానికి వచ్చి పలు ప్రైవేట్ సంస్థల్లో పనిచేశాడు. విలాసాలకు అలవాటుపడిన సాయికుమార్ సక్రమంగా విధులకు రాకపోవడంతో తొలగించేవారు. దీంతో తేలిగ్గా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో వాహనాల చోరీలు ప్రారంభించాడు. మెట్రో, రైల్వేస్టేషన్, బస్టాండ్‌లలోని పార్కింగ్ స్థలాల నుంచి ద్విచక్రవాహనాలను చోరీ చేయడం ప్రారంభించాడు. వాహనాల హ్యాండిల్ లాక్‌ను విరగ్గొట్టి మరో లాక్‌తో వాహనాలను కాజేసేవాడు. చోరీ చేసిన వాహనాన్ని వెంటనే విక్రయించకుండా మరొక పార్కింగ్ స్థలంలో పెట్టేవాడు. ఈ వాహనాల వివరాలను రిసీవర్లకు పంపేవాడు. వాహనం విక్రయించే సమయంలోనే దాచిన పార్కింగ్ స్థలం నుంచి వాహనాన్ని తీసుకెళ్లేవాడు. గతంలో నగరంలోని ఉప్పల్, మాదాపూర్, చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 27 వాహనాలను చోరీ చేసిన కేసులో ఉప్పల్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. ఇటీవల జైలు నుంచి విడుదలైన సాయికుమార్ మళ్లీ చోరీల బాటపట్టాడు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 17, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 18, రాచకొండ పరిధిలో 19 ద్విచక్రవాహనాలను చోరీ చేశాడు. ఓ చోరీ కేసులో బేగంపేట పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తుండగా పార్కింగ్ ప్రాంతంలో వాహనాన్ని చోరీ చేస్తూ సాయికుమార్ కనిపించాడు. దీంతో సాయికుమార్‌పై నిఘా పెట్టి పట్టుకున్నారు. సాయికుమార్‌తో పాటు ఇతడి వద్ద వాహనాలను కొనుగోలు చేస్తున్న కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గుండుగులపల్లికి చెందిన ఎం.జగదీష్(28), ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా కందుకూరు గ్రామానికి చెందిన కుంచాల హరికృష్ణ(25)ను అరెస్టు చేశారు. దొంగలను పట్టుకోవడంతో పాటు 59 ద్విచక్రవాహనాలను రికవరీ చేసిన బేగంపేట పోలీసులకు డీసీపీ రష్మీ పెరుమాళ్ నగదు పారితోషకాన్ని ఇవ్వడంతో పాటు అభినందించారు. సమావేశంలో అదనపు ఏసీపీ అశోక్, బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, ఇన్‌స్పెక్టర్లు సి.హెచ్. రామయ్య, మధుసూదన్ రెడ్డి, ఎస్సైలు గంగాధర్, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న బైక్‌లను పరిశీలిస్తున్న నార్త్‌జోన్ డీసీపీ రష్మీపెరుమాళ్, పోలీసులు



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ సురేష్‌కుమార్

ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

జీడిమెట్ల, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): పండుగలు శాంతియుతంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని బాలానగర్ డీసీపీ కె.సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ ఆవరణలో శాంతికమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి వివిధ మతాల పెద్దలు, భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. మిలాద్ ఉన్ నబీ, గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ ఏసీపీ హన్మంతరావు, సీఐ కె.క్రాంతికుమార్, క్రైమ్ సీఐ అంజయ్య పాల్గొన్నారు.



సరోజిని గార్డెన్ సమీపంలో, రాఘవేంద్ర కాలనీ వద్ద లీకవుతున్న తాగునీరు

పైప్‌లైన్ వాల్వ్‌ల వద్ద తాగునీరు లీకేజీ

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): లీకేజీల కారణంగా తాగునీరు వృథాగా రోడ్డు పాలవుతోంది. జీడిమెట్ల డివిజన్‌లోని సుచిత్ర నుంచి కుత్బుల్లాపూర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో జీడిమెట్ల గ్రామం నుంచి గాంధీ బొమ్మ కు వెళ్లే దారిలో లీకేజీలు ఏర్పడుతున్నాయి. కాలనీలకు నీరు విడుదల చేసినప్పుడల్లా వాల్వ్ నుంచి తాగునీరు భారీగా వృథా అవుతోంది. నిత్యం ఏదో ఒక చోట లీకేజీలు అవ్వడంతో నీరు వదిలినప్పుడల్లా రోడ్లపై తాగునీరు కాలువలా పారుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని తాగునీరు లీకేజీ కాకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



యలమర్తి అనురాధను సన్మానిస్తున్న అమెరికాలోని అభిమానులు

ప్రముఖ రచయిత్రి యలమర్తి అనురాధకు సత్కారం

అల్లాపూర్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నవల, గీత రచయిత్రి యలమర్తి అనురాధను అమెరికా కాలిఫోర్నియా రాష్ట్రం శాంటియాగోలో తెలుగు వారు సోమవారం సత్కరించారు. యలమర్తి రచనలు తమకెంతో స్ఫూర్తిదాయకమని, తమలాంటి వారి సమస్యలను పరిష్కరించుకునే విధంగా దిశా నిర్దేశం చేసేలా ఉంటాయని కార్యక్రమ నిర్వాహకులు జమున తెలిపారు. విదేశాల్లో కూడా అభిమానులను సంపాదించుకోవటం తన అదృష్టంగా భావిస్తున్నానని అనురాధ పేర్కొన్నారు. కార్యక్రమంలో చైత్ర, లక్ష్మి, కల్యాణి, భార్గవి, పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన పలు ప్రాంతాల ప్రజలు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

దుండిగల్, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు కాలనీలకు చెందిన ప్రజలు, కాలనీవాసులు బుధవారం ఆయనను కలిసి పలు సమస్యలను విన్నవించుకున్నారు. సమస్యలు పరిష్కారం కోసం తప్పకుండా కృషి చేస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్

నిజాంపేట్, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం లాంటిదని నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్‌కు చెందిన పేద కుటుంబానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఈశ్వర్‌రెడ్డి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.1 లక్ష విలువ చేసే ఎల్ఓసీని మంజూరు చేయించారు. ఈ లెటర్‌ను డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్‌తో కలిసి బుధవారం ఆయన కుటుంబీకులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక కార్యదర్శి సాంబశివారెడ్డి, స్థానికులు ఉన్నారు.



ఈశ్వర్‌రెడ్డి కుటుంబసభ్యులకు ఎల్ఓసీ పత్రాలను అందజేస్తున్న ధన్‌రాజ్‌యాదవ్

ఓపెన్‌గ్రౌండ్‌ను చిల్డ్రన్స్ పార్కుగా సుందరీకరిస్తాం

హైదర్‌నగర్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్‌నగర్ చౌరస్తా వద్ద గల ఖాళీ స్థలాన్ని సుందరీకరించి పిల్లల పార్క్ గా అభివృద్ధి చేయడానికి జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీజేఆర్‌నగర్‌లోని ఓపెన్‌గ్రౌండ్‌ను అభివృద్ధి చేయడానికి రూ.కోటి మంజూరయ్యాయని, పార్కు చుట్టూ ఫెన్సింగ్‌వాల్, పిల్లలు ఆడుకోవడానికి పరికరాలు, వాకింగ్‌ట్రాక్, పచ్చదనం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రావణి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రవికుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సమ్మారెడ్డి, అంజయ్యయాదవ్, శామ్యూల్ పాస్టర్, మహేష్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

పోస్టల్ పథకాలపై ప్రజలకు అవగాహన సదస్సు

నిజాంపేట్, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ బండారి లే-అవుట్‌లో పోస్టల్ సిబ్బంది పోస్టల్ పథకాల గురించి ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని 27వ డివిజన్ కార్పొరేటర్ జ్యోతిరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ప్రజలకు ఉపయోగపడే ఆధార్‌కార్డు, అడ్రస్సు మార్పులు, పోస్టల్ శాఖల స్కీమ్‌లపై అవగాహన కల్పించారు. సికింద్రాబాద్ డివిజన్ పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పోస్టల్ శాఖల స్కీమ్ సీనియర్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, అధికారులు, సిబ్బంది సాగర్ దండప్ప, ఏఎస్‌పీ ఎస్ పాండు, పోస్టుమాస్టర్ నిజాంపేట్ చిననర్సింహులు పాల్గొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు వాహనదారులను హెచ్చరించారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దూలపల్లి ఆటోస్టాండ్, సెయింట్ మార్టిన్ కళాశాల ముందు, పైప్‌లైన్ రోడ్డులో స్పెషల్ డ్రైవ్‌ను బుధవారం నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంగించిన 15 మంది వాహనదారులను ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి సూచనలు చేశారు. సిబ్బంది పాల్గొన్నారు.



బైకర్స్‌కు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ నాగరాజు

రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కులగణనను చేపట్టాలి

సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్‌సగర



శేఖర్‌సగర

మియాపూర్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర కుల గణన చేపట్టాలని తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్‌సగర డిమాండ్ చేశారు. కుల గణనను మూడు నెలల్లో నిర్వహించి నివేదిక సమర్పించాలని హైకోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేయడాన్ని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక, తెలంగాణ సగర సంఘం రాష్ట్ర కమిటీ స్వాగతిస్తోందని తెలిపారు. బీసీల లెక్కలు తేల్చాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించిన బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు జాతుల శ్రీనివాస్‌గౌడ్ కృషి అభినందనీయమని శేఖర్‌సగర అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం కోసం 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర కులగణన చేపట్టి దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. లేదంటే దేశవ్యాప్తంగా ఉద్యమం కొనసాగించడానికి బీసీలంతా ఏకమండం ఖాయమన్నారు.

వంటగ్యాస్ లీకై ఆరుగురికి గాయాలు

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): వంట చేస్తుండగా సిలెండర్ రెగ్యులేటర్ నుంచి గ్యాస్ లీకై మంటలు చెలరేగి ఆరుగురికి గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. పేట్‌బషీరాబాద్ ఎస్ఐ ధర్మేష్ తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లి అయ్యప్పకాలనీలో నివాసం ఉంటున్న పంచల హిందూ, ఐశ్వర్య, కృష్ణ, మారుతీ, బాబు, శోపాన్‌లు మంగళవారం రాత్రి ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ రెగ్యులేటర్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి, దీంతో చుట్టుప్రక్కల వారు అప్రమత్తమై రేకుల గదిలో వ్యాపించిన మంటలను అదుపు చేసేందుకు ఇంటి పైకప్పు రేకులు పగులగొట్టి మంటలను ఆర్పారు. ఇంట్లోని సామగ్రి కాలి బూడిదైంది. స్థానికులు పేట్‌బషీరాబాద్ పోలీసులకు, జీడిమెట్ల అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునే సరికి స్థానికులు మంటలను ఆర్పారు. 108 సహాయంతో గాయాలైన వారందరిని కొంపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పతికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

చైన్ స్నాచర్ అరెస్ట్

3 తులాల పుస్తెలతాడు స్వాధీనం

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన నేరస్తుడిని రాజేంద్రనగర్ సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. గచ్చిబౌలి కమిషనరేట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీపీ నర్సింహ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మియాపూర్‌కు చెందిన ఉప్పుగుంట సాగర్ (24) ప్రైవేటు స్కూల్ బస్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. వచ్చిన ఆదాయం ఖర్చులకు సరిపోకపోవడంతో చైన్ స్నాచింగ్స్ చేయాలని పథకం వేశాడు. వాహనం నెంబర్ ప్లేట్ కనపడకుండా స్టిక్కర్ వేసిన సాగర్ నార్సింగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అల్కాపురి కాలనీలో తన యాక్టివాపై రెక్కీ నిర్వహించాడు. ఈ తరుణంలో ఆగస్టు 17న స్కూల్ నుంచి పిల్లలను తీసుకువస్తున్న మహిళ మెడలోంచి పుస్తెల తాడును స్నాచింగ్ చేసి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అల్కాపురి కాలనీలో అనుమానాస్పదంగా బైకుపై సంచరిస్తున్న అతడిని రాజేంద్రనగర్ సీసీఎస్ పోలీసులు అదుపులో తీసుకొని ప్రశ్నించగా, చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. అతడి వద్ద నుంచి స్నాచింగ్ చేసిన పుస్తెలతాడు, యాక్టివా, మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు సాగర్ 2022లో కేపీహెచ్‌బీ కాలనీలో చైన్ స్నాచింగ్ చేసి, అరెస్టయ్యాడని డీసీపీ నర్సింహ తెలిపారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ నర్సింహ తదితరులు

ఎమ్మెల్యే గాంధీ అబద్ధాలు చెబుతున్నారు

హైదర్‌నగర్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): పీఏసీ ఛైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పార్టీ కండువాలపై చేసిన వ్యాఖ్యలు సరైనది కాదని, ఆయన అబద్ధాలు చెబుతున్నారని మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు అన్నారు. రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొన్న గాంధీ.. అది ఆలయ కండువా అని చెప్పడం పచ్చి అబద్ధమన్నారు. రేవంత్‌రెడ్డి ఇల్లు దేవాలయం కాదని, సీఎం పూజారి కాదని, గాంధీ వేసుకున్నది ఆలయ కండువ కాదని అన్నారు. పదవుల కోసం పార్టీ మారలేదన్న ఎమ్మెల్యే, మరి పీఏసీ ఛైర్మన్ పదవి ఎందుకు తీసుకున్నాడని ప్రశ్నించారు. హైకోర్టు ఇచ్చిన తీర్పునకు భయపడి పార్టీ మారలేదని అంటున్నారని, ప్రభుత్వ పెద్దలు పీఏసీ ఛైర్మన్ ఇచ్చి ఈ విధంగా మాట్లాడిస్తున్నారని రంగారావు ఆరోపించారు. ఎమ్మెల్యే గాంధీ పార్టీలు మారుస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి బీఆర్ఎస్‌లో చేరారని గుర్తు చేశారు.



మాట్లాడుతున్న రంగారావు

లింగం చెరువులో దూకిన ట్రాన్స్‌జెండర్

గాజులరామారం: సూరారం ప్రాంతానికి చెందిన సుమారు 45 నుంచి 50 సంవత్సరాలు ఉన్న గుర్తు తెలియని ట్రాన్స్‌జెండర్ సూరారం లింగం చెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. దీంతో స్థానికులు గమనించి పోలీస్, జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ బృందానికి సమాచారం అందించారు. వెంటనే చెరువు వద్దకు చేరుకున్న అధికారులు చెరువు నుంచి ఆమెను బయటకు తీసి సీపీఆర్ చేసి, సమీపంలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు.



ట్రాన్స్‌జెండర్‌ను బయటకు తెస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

అతిథి అధ్యాపకులకు ఇంటర్వ్యూలు నేడు

మదీన: హుసేనిఆలం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ అపియ చిన్నమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఎకనమిక్స్ (ఉర్దూ మీడియం)-1, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఇంగ్లిష్ మీడియం) -1, బయోటెక్నాలజీ (ఇంగ్లిష్ మీడియం)-1, కంప్యూటర్‌సైన్స్ అండ్ అప్లికేషన్స్ (ఇంగ్లిష్ మీడియం)-3, జువాలజీ (ఇంగ్లిష్ మీడియం)-2 పోస్టులు ఖాళీలున్నాయని తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులు, ఎస్సీ ఎస్టీలకు 50శాతం మార్కులు ఉండాలని తెలిపారు.

చాక్లెట్ కంపెనీలో అగ్నిప్రమాదం

పేట్ బషీరాబాద్: చాక్లెట్ తయారు చేసే పరిశ్రమలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ భాగ్యలక్ష్మి కాలనీలోని గోకుల్ దాస్ పరిశ్రమలో చాక్లెట్స్ పౌడర్‌ను వేడి చేసే క్రమంలో గ్యాస్ లీకేజీ కావడంతో దట్టమైన పొగలు వ్యాపించి మంటలు చెలరేగాయి. స్థానికులు పోలీసులకు అగ్నిమాపక సిబ్బందికి సమాచారాన్ని అందించారు. ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. ఈ మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని కేసును దర్యాప్తు చేస్తున్నారు.

నేరస్థులపై నిరంతర నిఘా: క్రైం డీసీపీ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): దోపిడీ దొంగలు, చైన్ స్నాచర్‌లు, ఇతర ప్రాపర్టీ అఫెన్సెస్‌కు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపనున్నారు. నేర నియంత్రణే లక్ష్యంగా సైబరాబాద్ సీసీఎస్ పోలీసులు నేరస్తులపై స్పెషల్ ఫోకస్ పెట్టినట్లు క్రైమ్స్ డీసీపీ నరసింహా పేర్కొన్నారు. నేర తీవ్రతను బట్టి ఒక్క కేసులో ప్రమేయం ఉన్నా.. రెండు మూడు నేరాలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలినా వెంటనే హిస్టరీ షీట్స్ తెరుస్తున్నట్లు తెలిపారు. ఒక్క సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోనే 1,200 మందికి పైగా ప్రాపర్టీ అఫెండర్స్‌పై హిస్టరీ షీట్స్ నమోదైనట్లు పేర్కొన్నారు. హిస్టరీ షీట్ తెరిచినప్పటి నుంచి సీసీఎస్ టీమ్‌లు నేరస్థుల కదలికలపై నిరంతరం నిఘా పెడుతున్నాయన్నారు. నేరస్థులు ఇతర రాష్ట్రాలకు, జిల్లాలకు చెందినవారైతే.. వారు నగరం విడిచి వెళ్లినా..? వేరే ప్రాంతాలకు వెళ్లి స్థిరపడినా.. వారిపై నమోదైన హిస్టరీ షీట్‌ను అక్కడి స్థానిక పోలీసులకు పంపిస్తున్నట్లు తెలిపారు.

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రజాపద్దుల కమిటీ ఛైర్మన్ (పీఏసీ) ఛైర్మన్‌గా నియమితులైన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి తనకు పీఏసీ ఛైర్మన్ అవకాశం కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

- ఎమ్మెల్యే గాంధీ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ సెక్రటరీ నరసింహచార్యులను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యే గాంధీ

ఎమ్మెల్యే గాంధీకి శుభాకాంక్షల వెల్లువ

మియాపూర్: పీఏపీ ఛైర్మన్‌గా నియమితులైన ఎమ్మెల్యే గాంధీకి పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, అభిమానులు బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాలు, పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు చెప్పేందుకు పెద్దసంఖ్యలో తరలిచ్చారు.

ఆ మూడు పార్టీలు కలిసినా బీజేపీని ఓడించలేవు

సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్

రాయదుర్గం, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం మూడు పార్టీలు కలిసి పోటీ చేసినా బీజేపీని ఓడించలేవని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం గచ్చిబౌలి డివిజన్‌లోని గౌలిదొడ్డి గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డిలతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రతీ కార్యకర్త కష్టపడి మరింత మందిని సభ్యులుగా చేర్పించాలన్నారు. సభ్యత్వ నమోదు అనేది పార్టీ ప్రజల్లోకి మరింతగా వెళ్లేందుకు, ప్రజలకు పార్టీని చేరువ చేసేందుకు వీలు కలుగుతుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒక్కటేనని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను నమ్మి ప్రజలు ఓట్లు వేసి గెలిపించారన్నారు. వాళ్ల ఒక్క గ్యారంటీకి కూడ వారంటీ లేదన్నారు. రుణ మాఫీ, రైతుభరోసా, మహిళలకు రూ.4 వేలు, తులం బంగారం, నిరుద్యోగ భృతి, ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. 6 గ్యారంటీల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే హైడ్రా డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. బీజేపీకి తప్ప ఏ పార్టీకీ సిద్ధాంతాలు లేవన్నారు. నేషన్ ఫస్ట్ మనం సెకండ్ అనేది బీజేపీ నినాదమన్నారు. మోదీ నాయకత్వంలో అభివృద్ధి పంథాలో దేశం ముందుకు వెళ్తోందన్నారు. దేశంలో ఎక్కువ మంది సభ్యుత్వం కలిగిన పార్టీ బీజేపీ అన్నారు. జిల్లాలో అత్యధికంగా సభ్యత్వ నమోదు చేపట్టాలని సామ రంగారెడ్డి పిలుపునిచ్చారు. శేరిలింగంపల్లి ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ దేశంలో బీజేపీకి ఎదురులేదన్నారు. కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడారు. జిల్లా నాయకులు ధర్మగారి రవీందర్‌రెడ్డి, బసంత్‌యాదవ్, కృష్ణ ముదిరాజ్, ఎల్లేష్, రాధాకృష్ణ, రాజుశెట్టి పాల్గొన్నారు.



కార్యక్రమంలో కేంద్రమంత్రి బండి సంజయ్, ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి తదితరులు

గణపయ్యకు ఘనంగా పూజలు



పూజల్లో ఎస్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు, ఎస్సై సుమన్, శేరి సతీష్‌రెడ్డి తదితరులు



మూసాపేటలో వినాయకుడి పూజల్లో ఏసీపీ శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ తదితరులు

(జోన్‌బృందం, ఆంధ్రజ్యోతి)

గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల పరిధిలోని వివిధ డివిజన్లు, కాలనీలు, వాడల్లో ప్రతిష్ఠించిన గణేశులకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు మండపాల వద్ద అన్నప్రసాద వితరణ చేశారు.



అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్‌లో బాలగణపతి యూత్ సభ్యులు, కాలనీ నాయకులు ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ